COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 14 ఫిబ్రవరి, 2023.

**కేంద్ర బడ్జెట్, అదానీ అవినీతికి నిరసనగా**
**ఫిబ్రవరి 24న ధర్నాలు – ప్రదర్శనలు**
**: సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ పిలుపు**

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలు విధించి ప్రజలపై అదనపు భారాలు వేసినందుకు, అదానీ అవినీతికి నిరసనగా ఈ నెల 24వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ నెల 12, 13 తేదీలలో కా॥ వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటి సమావేశం వివిధ ప్రజాసమస్యలపై చర్చించింది. పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, కా॥ బి.వి.రాఘవులు, కా॥ ఎం.ఏ.బేబి హాజరయ్యారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ కోతలు విధించింది. ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచింది. పెరిగిన ధరలు, ఎరువులు అందక రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. అప్పులు రెట్టింపు అయ్యాయి. ఆత్మహత్యలు పెరిగాయి. కౌలు రైతులను కనీసం గుర్తించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో భారీ కోతలు విధించారు. ఇది పేదల కడుపు కొట్టడం తప్ప మరేమీ కాదు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ఎత్తివేశారు. బడ్జెట్‌లో సంక్షేమ నిధులు తగ్గిపోయాయి. ప్రజాపంపిణీ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేశారు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న జనానికి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా ఈ బడ్జెట్ భారాలు కోలుకోలేని దెబ్బతీస్తాయి.

మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడమే కాకుండా విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు నామకా నిధులు విడుదల చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకపోగా పుండుపై కారం చల్లినట్లుగా తుంగభద్ర కెనాల్స్ కింద నీటి సరఫరాను దెబ్బకొట్టే కర్ణాటకలోని అప్పర్ భద్రకు కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వడం దారుణం. ఆంధ్ర, కర్ణాటకల మధ్య విద్వేషాలు పెంచి రానున్న కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుయుక్తులు పన్నింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపలేదు. కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, పోలవరానికి నిధులు ఇవ్వలేదు. ఇలా ఈ బడ్జెట్ రాష్ట్రం పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించింది.

అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చింది. చిన్న మదుపుదార్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసిని ముంచేశారు. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని అదానీపరం చేస్తుండడాన్ని సిపిఐ(యం) తీవ్రంగా ఖండిస్తున్నది. అధికార, ప్రతిపక్ష పార్టీలు అదానీ అవినీతికి వ్యతిరేకంగా ముందుకు రావాలని కోరుతున్నది.

రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా పార్లమెంటులో మన రాష్ట్రానికి చెందిన సభ్యులు నోరెత్తడం లేదు. మన రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టడం పట్ల సిపిఐ(యం) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్రం హక్కుల సాధనకోసం అన్ని నియోజకవర్గాల్లో పార్లమెంటు సభ్యులకు వినతిపత్రాలు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. ఫిబ్రవరి 24వ తేదీన జిల్లా, మండల కేంద్రాలలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు లేదా బహిరంగ కూడలిలో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి